సాక్షి అనకాపల్లి

ఆదివారం । 24 । ఆగస్టు । 2025



సిరులతల్లికి తులసిపూజ

డాబాగార్డెన్స్(విశాఖ): బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో శనివారం తులసిపూజ నిర్వహించారు.



వెనక్కి వెళ్లిన సముద్రం

కొమ్మాది(విశాఖ): ఇటీవల పెద్ద ఎత్తున కెరటాలు ఎగసి పడుతూ ముందుకు చొచ్చుకుని వచ్చిన సముద్రం, రుషికొండ బీచ్ వద్ద వెనక్కి మళ్లింది.



ఘనంగా అప్పన్నకు తిరువీధి

సింహాచలం: అమావాస్యను పురస్కరించుకుని శ్రీవరాహ లక్ష్మీనృసింహ స్వామికి శనివారం విశేషంగా తిరువీధి జరిగింది.

న్యూస్‌రీల్

టంగుటూరి స్ఫూర్తితో దేశ సేవ చేయాలి



టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్

అనకాపల్లి: ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు స్ఫూర్తితో యువత దేశ సేవ చేయాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు. టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా తన కార్యాలయంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రత్యేకాంధ్ర రాష్ట్ర సాధనలో నిర్ణయాత్మక పాత్ర పోషించి, ఆంధ్రరాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా పనిచేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో వై. సత్యనారాయణరావు , స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు సుబ్బలక్ష్మి, రమామణి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన దివ్యాంగుల పింఛన్లు తొలగించడం అన్యాయం



మాట్లాడుతున్న పాత్రుపల్లి వీరుయాదవ్

అనకాపల్లి: అర్హులైన దివ్యాంగుల పింఛన్లు తొలగించడం అన్యాయమని విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు పాత్రపల్లి వీరుయాదవ్ అన్నారు. స్థానిక ఉడ్‌పేట సంఘం కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటివరకు ఐదు లక్షల మంది దివ్యాంగుల సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేశారని తెలిపారు. అందులో లక్ష మందిని అనర్హులుగా గుర్తించారని చెప్పారు. దీనిపై రాష్ట్రమంతటా దివ్యాంగుల నుంచి తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తమవుతోందని చెప్పారు. దివ్యాంగుల హక్కులను ప్రభుత్వం కాలరాస్తోందని తెలిపారు. ఈ విషయమై సీఎం చంద్రబాబు పునరాలోచన చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో సంస్థ కార్యదర్శి మొల్లి చంద్రశేఖర్, సభ్యులు యలమర్తి రవి, మంత్రి శ్రీనివాసరావు, కరణం శివ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద దివ్యాంగుల ధర్నా రేపు

అనకాపల్లి: అర్హులైన దివ్యాంగుల ఫించన్లు తొలగించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, కొత్త పింఛన్లు ఇవ్వకపోవడమే కాకుండా ఉన్న పింఛన్లు తొలగించడం అన్యాయమని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి బుగిడి నూకఅప్పారావు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇందుకు నిరసనగా ఈనెల 25న కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్టు తెలిపారు. అర్హులైన దివ్యాంగులు పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన కోరారు.

- బార్లకు దరఖాస్తులు నిల్
- ఇప్పటి వరకూ రాని ఒక్క దరఖాస్తు
- ఈ నెల 26తో ముగియనున్న గడువు
- వైన్‌షాపుల పర్మిట్ రూమ్‌లు, బెల్టుషాపులతో తగ్గిన బార్ల ఆదాయం
- బార్ల నిర్వహణకు ముందుకు రాని వ్యాపారులు
- దరఖాస్తులు చేయాలని బతిమలాడుతున్న ఎక్సైజ్ అధికారులు

రాబడి మూరెడు పెట్టుబడి బార్‌డు..



నర్సీపట్నం:

కూటమి ప్రభుత్వ కొత్త బార్ పాలసీకి స్పందన కరువైంది. కొత్త బార్ల కోసం ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసినా ఒక్క అప్లికేషన్ కూడా పడకపోవడంతో ఎక్సైజ్ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. కొత్త పాలసీ ప్రకారం ప్రభుత్వం జిల్లాకు 11 బార్లు కేటాయించింది. వీటిలో జీవీఎంసీ పరిధిలో అనకాపల్లిలో 5, సబ్బవరంలో 2 బార్లను కేటాయించారు. ఒక వైపు పర్మింట్ రూమ్‌లు, మరో వైపు బెల్ట్ షాపుల్లో విచ్చలవిడిగా మద్యం **అమ్మకాలు సాగిస్తుండడం**, భారీ పెట్టుబడితో కూడి**న వ్యాపారం కావడం**తో ఆశించిన మేరకు లాభాలు **వస్తాయా లేదా అని** తర్జనభర్జనతో బార్ల కోసం **దరఖాస్తు చేసేందుకు** వ్యాపారులు వెనుకడుగు వేస్తు**న్నారు. ఎక్కడికక్కడ** మద్యం దుకాణాలతో పాటు **నందు, గొందుల్లో** బెల్టుషాపులు ఏర్పాటు చేయ**డంతో బార్లకు వచ్చే** వారి సంఖ్య గణనీయంగా ప**డిపోయింది. ప్రస్తుతం** బార్లలో అమ్మకాలు భారీగా **తగ్గిపోయాయి. ఫలి**తంగా జిల్లాలో కొత్త బార్‌ల**కు నోటిఫికేషన్ జారీ** చేసినా దరఖాస్తు చేసేందుకు **ఎవరూ ముందుకు** రాని పరిస్థితి నెలకొంది. **సమయం దగ్గర పడు**తున్నా ఒక్క అప్లికేషన్ కూడా **రాలేదు.**

గత ప్రభుత్వ హయాంలో పోటీ పడి..

గత ప్రభుత్వ హయాంలో **2022లో వెలువడిన** నోటిఫికేషన్‌లో మూడేళ్ల కాల **పరిమితితో బార్ల నిర్వ**హణకు అనుమతులు పొంద**ారు. ఇ–వేలం నిర్వ**హించడంతో వ్యాపారులు **పోటీపడి భారీ** మొత్తాలకు అనుమతులు దక్కించుకున్నారు. గత ప్రభుత్వంలో బెల్టు దుకాణాలు లేకుండా ప్రభుత్వమే మద్యం దుకాణాలు నిర్వహించేది. సమయపాలన ఉండేది. దీంతో బార్లకు మంచి డిమాండ్ ఉండేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు సాగిస్తుండడంతో బార్లకు వచ్చే వారి సంఖ్య తగ్గిపోయింది. జిల్లాలో **యలమంచిలిలో రెండు , నర్సీపట్నంలో రెండు బార్‌ల ఏర్పాటుకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. అప్లికేషన్ ఫీజు రూ.5 లక్షలు నిర్దేశించింది. 50 వేలు జనాభా దాటిన నర్సీపట్నంలో ఏడాదికి** లైసెన్సు రూ.55 లక్షలు, యలమంచిలిలో రూ.35 లక్షలు ఫిక్స్ చేసింది. ప్రాసెసింగ్ ఫీజు కింద మరో రూ.10 లక్షలు నిర్దేశించింది. జీరో మార్జిన్ నిర్దేశించింది. ఈ నెల 26తో గడువు ముగిస్తున్న ఇప్పటికీ ఒక్క అప్లికేషన్ కూడా రాలేదు.

కూటమి ప్రభుత్వం మద్యం దుకాణాలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించింది. గత ఏడాది అక్టోబరులో **జిల్లాలో 144 మద్యం దుకాణాలు ఏర్పాటయ్యాయి. మద్యం షాపుల నిర్వాహకులకు 14 శాతం మార్జిన్ ఇస్తుంది. బార్లకు వచ్చే సరికి జీరో మార్జిన్ విధించింది. దీంతో వ్యాపారులు అప్లికేషన్లు** వేసేందుకు ముందుకు రావటం లేదు.

మినీ బార్లుగా పర్మిట్‌రూంలు

మద్యం దుకాణాల నిర్వాహకులు పర్మిట్ రూంలు ఏర్పాటు చేసుకున్నారు. దుకాణాల వద్దే మందుబాబులతో మద్యం తాగిస్తున్నారు. వారికి ఆహార పదార్థాలు, వాటర్‌బాటిల్స్ కూడా విక్రయిస్తున్నారు. దీంతో పర్మిట్‌రూమ్‌లు మినీ బార్లను తలపి**స్తున్నాయి. ఎక్కువమంది మందుబాబులు దుకాణాల వద్దే తాగేస్తున్నారు. ప్రతి మద్యం షాపు వద్ద తప్పనిసరిగా పర్మిట్ రూమ్ పెట్టుకోవాలని అధికారులు ఆంక్షలు పెట్టారు.** లేదంటే పర్మిట్ రూమ్‌కు సంబంధించిన ఫీజు కట్టాల్సిందేనని అధికారులు హుకుం జారీ చేశారు. ఒక్కో పర్మిట్ రూమ్‌కు రూ.7.50 లక్షలను ప్రభుత్వం వసూలు చేస్తోంది. పర్మిట్ రూమ్‌లే బార్లను తలపిస్తుండడంతో, బార్లకు వచ్చేవారి సంఖ్య తగ్గిపోయింది. దీంతో బార్ల నిర్వాహణకు ఎవరూ ముందుకు రాకపోవడంలేదు

వ్యాపారులకు నచ్చజెబుతున్న అధికారులు

ఎక్సైజ్ అధికారులు రంగంలోకి దిగి మద్యం వ్యాపారులతో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. దరఖాస్తు చేయాలని నచ్చచెబుతున్నారు. బయట వ్యక్తుల వల్ల ఇబ్బందులు పడకుండా ఉండాలంటే మీరే బార్లను నడుపుకోవటం మంచిదని వ్యాపారులకు అధికారులు సలహాలు ఇచ్చి మోటివేషన్ చేస్తున్నారు.

ఉక్కు కోసం ఉమ్మడి పోరాటం



మాట్లాడుతున్న శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ, చిత్రంలో వైఎస్సార్ సీపీ విశాఖ, అనకాపల్లి జిల్లాల అధ్యక్షులు కేకే రాజు, అమర్‌నాథ్, ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, కుంభా రవిబాబు, పార్టీ సమన్వయకర్తలు, ముఖ్య నేతలు

- రాజకీయాలకతీతంగా స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకుందాం
- హామీలు మరిచి కార్మికుల జీవితాలతో కూటమి ఆటలు
- త్వరలో కార్మిక సంఘాలు, నిర్వాసితులతో ఉమ్మడి కార్యాచరణ
- ఎమ్మెల్సీ, శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ వెల్లడి

సాక్షి, విశాఖపట్నం: ఆంధ్రుల ఆత్మగౌరవమైన విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా అడ్డుకుందామని శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ పిలుపునిచ్చారు. రాజకీయాలకు అతీతంగా, ఈ విషయంలో ముందుకు వచ్చే అన్ని రాజకీయ పార్టీలతో కలిసి పోరాటానికి వైఎస్సార్ సీపీ సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. శనివారం లాసన్స్‌బే కాలనీలోని బొత్స క్యాంపు కార్యాలయంలో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి పార్టీ విశాఖ, అనకాపల్లి జిల్లాల అధ్యక్షులు కేకే రాజు, గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, కుంభా రవిబాబు, మాజీ ఎమ్మెల్యేలు, జీవీఎంసీ కార్పొరేటర్లు, పార్టీ ముఖ్య నాయకులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా బొత్స సత్యనారాయణ మాట్లాడారు. 'విశాఖ ఉక్కు అనేది ఆంధ్రుల ఆత్మగౌరవానికి సంబంధించిన అంశం. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకునేందుకు ఏ రాజకీయ పార్టీ కార్యాచరణ రూపొందించినా వైఎస్సార్ సీపీ మద్దతు ఇస్తుంది. ఎట్టి పరిస్థితుల్లోనూ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ కాకూడదన్నదే మా అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయం, మా పార్టీ లక్ష్యం.' అని అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కోసం, కార్మికుల కుటుంబాల భవిష్యత్తు కోసం కూటమి ప్రభుత్వం అఖిలపక్షాన్ని ఏర్పాటు చేసి ప్రధాని వద్దకు తీసుకెళ్తే.. తాము రావడానికి సిద్ధంగా ఉన్నామని తేల్చి చెప్పారు. తమ ప్రభుత్వ హయాంలో నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా అడ్డుకున్నారని ఈ సందర్భంగా గుర్తుచేశారు. 2024 ఎన్నికల ప్రచారంలో 'మేము అధికారంలోకి వస్తే స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ కానివ్వం'అని టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నేతలు ప్రగల్భాలు పలికారన్నారు. కానీ, నేడు అధికారంలోకి రాగానే అందుకు విరుద్ధంగా ప్రైవేటీకరణకు ముందడుగు వేస్తూ కార్మికుల జీవితాలతో ఆటలాడుతున్నారని బొత్స మండిపడ్డారు. కూటమి ప్రభుత్వ చర్యలను ఖండిస్తూ, త్వరలోనే అన్ని రాజకీయ పార్టీల నాయకులు, కార్మిక సంఘాల నాయకులు, స్టీల్ ప్లాంట్ నిర్వాసితులతో కలిసి ఉమ్మడి కార్యాచరణను రూపొందిస్తామని ప్రకటించారు. సమావేశంలో నియోజకవర్గ సమన్వయకర్తలు వాసుపల్లి గణేష్‌కుమార్, మొల్లి అప్పారావు, తిప్పల దేవన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు తైనాల విజయకుమార్, తిప్పల గురుమూర్తి రెడ్డి, చింతలపూడి వెంకటరామయ్య, డిప్యూటీ మేయర్ కె.సతీష్, ముఖ్యనేతలు గొలగాని హరి వెంకట కుమారి, జియ్యాని శ్రీధర్, రవిరెడ్డి, పుడా రవి, రొంగలి జగన్నాథం, పురుకూటి అప్పారావు, ఫరూఖీ, జహీర్ అహ్మద్, కార్పొరేటర్లు బాణాల శ్రీనివాసరావు, అల్లు శంకరరావు, అక్కరమాని పద్మ రాము నాయుడు, దొలపల్లి ఏడుకొండలరావు, కోరుకొండ స్వాతి దాస్, అక్కరమాని రోహిణి, కె.అనిల్ కుమార్‌రాజు, మొల్లి లక్ష్మి, నక్కిల లక్ష్మి, సాడి పద్మారెడ్డి, పి.వి.సురేష్, పల్లా అప్పలకొండ, బిపిన్ కుమార్ జైన్, తోట పద్మావతి, చెన్న జానకీరామ్, గుండపు నాగేశ్వరరావు, కోడిగుడ్ల పూర్ణిమ, వావిలపల్లి ప్రసాద్, రెయ్యి వెంకట రమణ, బర్కత్ అలీ, కె.వి.శశికళ, గులిగిందల లావణ్య, బల్ల లక్ష్మణ్, మహమ్మద్ ఇమ్రాన్, గుడివాడ సాయి అనూష లతీష్, ఉరుకూటి రామచంద్రరావు, కో–ఆప్షన్ సభ్యులు ఎం.డి షరీఫ్, ఫాతిమా రాణి, సేనాపతి అప్పారావు, ముప్పల సురేష్, పల్లా దుర్గ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీలో మహిళల సత్తా

- పలు విభాగాల్లో టాపర్లు వీరే..
- విడుదలైన మెరిట్ జాబితా

ఆరిలోవ(విశాఖ): రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు డీఎస్సీ–2025 మెరిట్ జాబితాను శుక్రవారం రాత్రి విడుదల చేసింది. దీంతో అభ్యర్థుల్లో నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. తొలుత మెరిట్ జాబితా ఇవ్వకుండా నేరుగా అభ్యర్థుల సెల్‌ఫోన్లకు సందేశాలు పంపి, సర్టిఫికెట్ల పరిశీలనకు పిలవాలని ప్రభుత్వం భావించింది. అయితే ఇది అభ్యర్థులలో గందరగోళానికి దారితీయడంతో, ప్రభుత్వం స్పందించి విభాగాల వారీగా మెరిట్ జాబితాను విడుదల చేసింది.

1,139 పోస్టులకు 14,595 మంది పోటీ

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్లు(ఎస్ఏ), పీఈటీలతో కలిపి మొత్తం 1,139 పోస్టులు ఉన్నాయి. ఈ ఉద్యోగాల కోసం అన్ని కేటగిరీల నుంచి 14,595 మంది అభ్యర్థులు పరీక్ష రాశారు. మొత్తం ఖాళీల్లో సెకండరీ గ్రేడ్ టీచర్స్ (ఎస్జీటీ) పోస్టులు 574 ఉండగా, మిగిలిన 565 పోస్టులు స్కూల్ అసిస్టెంట్ (గణితం, ఫిజికల్ సైన్స్, సోషల్ స్టడీస్, తెలుగు, హిందీ, సంస్కృతం, ఇంగ్లిష్, ఫిజికల్ ఎడ్యుకేషన్) కేటగిరీలకు చెందినవి.అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలనకు జిల్లా విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది.

జిల్లా స్థాయి టాపర్లు వీరే..

ఈ ఫలితాల్లో పలు కేటగిరీల్లో మహిళలు ప్రథమ స్థానాల్లో నిలిచి తమ ప్రతిభను చాటారు. ఎస్జీటీ కేటగిరీలో గనివాడ సుజాత(92.90 మార్కులు) ప్రథమ ర్యాంక్ సాధించగా, తాటికొండ ధనలక్ష్మి(92.58), కొల్లి శ్రీదేవి (92.02), ఆదిగర్ల సంధ్య (91.65) తర్వాతి స్థానాల్లో నిలిచారు. స్కూల్ అసిస్టెంట్లు(ఎస్ఏ) కేటగిరీలో గణితంలో సుంకరం విజయ్ (94.67), ఫిజికల్ సైన్స్‌లో ఎస్.శ్రీనివాస్(82.87), బయోలాజికల్ సైన్స్‌లో బోకం అనిత (89.71), సోషల్ స్టడీస్‌లో గెంజి రవి (87.28), తెలుగులో పంపోతు నాగేశ్వరరావు (85.40), ఇంగ్లిష్‌లో మరడాన శ్రావణి(86.13), హిందీలో కురచా జ్యోత్స్న (86.05), ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో గొర్లె శివరామకృష్ణ (83.5) జిల్లా టాపర్లుగా నిలిచారు.

మెరిసిన విజయ్

- మూడు విభాగాల్లో రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంకు



విజయ్

ఎస్.రాయవరం: వమ్మువరం అగ్రహారానికి చెందిన ఎస్.విజయ్ డీఎస్సీలో ప్రతిభ కనబరిచాడు. మూడు విభాగాల్లో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచాడు.వమ్మువరం ప్రాథమికోన్నత పాఠశాల ఒకటి నుంచి 7వ తరగతి వరకు, ధర్మవరం అగ్రహారంలో 10వ తరగతి వరకు, ప్రభుత్వ కళాశాలలో ఇంటర్,డిగ్రీ చదివాడు. అనకాపల్లి ఏఎంఎల్‌లో పీజీ పూర్తి చేశాడు. 2015–17లో బీఎడ్ చేశాడు. ఆ తరువాత ప్రైవేటు పాఠశాలలో పనిచేస్తూ డీఎస్సీ రాసి పీజీటీ, టీజీటీ,స్కూల్ అసిస్టెంట్(మేథ్స్)లో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం సాధించాడు. స్కూల్ అసిస్టెంట్‌గా చేరుతానని విజయ్ చెప్పాడు. విజయ్‌ను ఉపాధ్యాయులు సత్యనారాయణ, రమేష్, ప్రకాశ్, శర్మ, శ్రీనివాసరావు తదితరులు సన్మానించారు.

అందుబాటులోకి పారిపల్లెమ్మ ఎత్తిపోతల పథకం



వాడ్రాపల్లిలో వరినాట్లు వేస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్

- కలెక్టర్ హామీ
- రైతులతో కలిసి వరినాట్లు వేసిన విజయ కృష్ణన్

మునగపాక: మండలంలోని వాడ్రాపల్లిలో పారిపల్లెమ్మ ఎత్తిపోతల పథకాన్ని అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు చర్యలు తీసుకుంటానని కలెక్టర్ విజయ కృష్ణన్ హామీ ఇచ్చారు. వాడ్రాపల్లిలో శనివారం ఆమె పర్యటించి, రైతులతో కలిసి వరి నాట్లు వేశారు. అనంతరం ఆమె వారితో మాట్లాడారు. ఖరీఫ్ సీజన్‌కు అవసరమయ్యే ఎరువులు, విత్తనాలు అందుబాటులోకి తీసుకు వచ్చినట్టు చెప్పారు. అయితే కొంతమంది రైతులు అధికంగా వినియోగించడం వల్ల యూరియాకు డిమాండ్ వచ్చిందన్నారు. దమ్ములో యూరియా వినియోగం తగ్గించి పొటాష్ ఎరువులను వేసుకోవాలని సూచించారు.రైతు సేవా కేంద్రాల్లో యూరియాను అందుబాటులోకి తీసుకువచ్చేలా చూడాలని అధికారులకు ఆదేశించారు.నానో యూరియాను వినియోగించుకోవాలన్నారు. సాగునీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తూ వరి,చెరకులో అధిక దిగబడులు సాధించాలన్నారు. అనంతరం కలెక్టర్ విజయ కృష్ణన్‌ను స్థానికులు కొయిలాడ దశావతారం,మళ్ల రాజేష్, నరసింగరావు, శేషు తదితరులు సత్కరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి బి.మోహనరావు, మండల వ్యవసాయాధికారి జ్యోత్స్నకుమారి,తహసీల్దార్ పి.సత్యనారాయణ,ఏఈవో లక్ష్మి, వీఏఏ లక్ష్మీ సింధూజ, వీహెచ్ఏ సంతోష్, మళ్ల కన్నునాయుడు,బొడ్డేడ సత్యనారాయణ,మళ్ల మల్లయ్యనాయుడు,ఆడారి శివ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు



ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

నర్సీపట్నం: పట్టణంలోని ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. విజిలెన్స్ ఎస్ఐ రవితేజ, ఏవో విజయలక్ష్మి, మండల లెవెల్ టీం సభ్యులైన మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్, ఎంపీడీవో ఉషశ్రీ ఈ దాడుల్లో పాల్గొన్నారు. విజయలక్ష్మి జనరల్ స్టోర్, మరో రెండు ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఎరువుల స్టాక్ వివరాల రికార్డులను, బిల్లు బుక్‌లను పరిశీలించారు.

ఎరువుల సరఫరాలో కూటమి ప్రభుత్వం విఫలం

- సీపీఎం జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు

అనకాపల్లి: ఖరీఫ్ సీజన్‌లో రైతులకు సరిపడా ఎరువులు సరఫరా చేడయంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని, సీజన్‌కు ముందే అవసరమయ్యే ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉంచకుండా అన్నదాతలను ఇబ్బందులకు గురిచేయడం అన్యాయమని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వ్యవసాయ పనులు ముమ్మరంగా జరుగుతున్న సమయంలో ఎరువులు, విత్తనాలను అరకొరగా సరఫరా చేయడం తగదని తెలిపారు. ఏ ప్రాంతంలో చూసినా ఎరువుల కొరత తీవ్రంగా ఉందని పేర్కొన్నారు. యూరియా, డీఏపీ కొరత రైతులను కలవరపెడుతోందని తెలిపారు. రైతులు అధిక ధరలు చెల్లించి ప్రైవేట్ దుకాణాల్లో కొనుగోలు చేసుకునే పరిస్థితి ఏర్పడిందని, ఖరీఫ్, రబీ సీజన్లకు ముందుగానే రైతు భరోసా కేంద్రాల్లో పూర్తిస్థాయిలో ఎరువులు రైతులకు అందుబాటులో ఉంచకుండా ఇబ్బందులకు గురిచేయడం అన్యాయమని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో పంటల బీమా పథకం ప్రీమియం ప్రభుత్వమే చెల్లించేదని, కూటమి పాలనలో రైతులే పంటబీమా చెల్లించాలని ఆదేశాలు జారీచేయడం తగదని తెలిపారు. శాస్త్రీయంగా నిరూపితం కాకపోయినా సరే, నానో ఎరువుల ప్రమోషన్ భుజానికెత్తుకున్న మోడీ ప్రభుత్వం ఈ సంవత్సరం భారీగా వాటి అమ్మకాలను పెంచేందుకు రాష్ట్రాలపై ఒత్తిడి పెంచిందని తెలిపారు. రాష్ట్రంలో 2.6 లక్షల యూరియా బాటిళ్లు, 1.02 లక్షల డీఏపీ బాటిళ్ల విక్రయించాలని రాష్ట్ర ప్రభుత్వం చూస్తోందని పేర్కొన్నారు. రైతులు నానో ఎరువులను తిరస్కరిస్తున్నా అమ్మాల్సిందేనన్న కేంద్రం ఆదేశాలకు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం తలొగ్గిందని తెలిపారు. పీఏసీఎస్‌లు, రైతు సేవా కేంద్రాలు, మార్క్‌ఫెడ్, మార్కెటింగ్ సంస్థల్లో నానో ఎరువులను రైతులకు అంటగట్టేవిధంగా చర్యలు చేపట్టడం అన్యాయమని పేర్కొన్నారు.

రోడ్లను ఎందుకు బాగుచేయలేదు

- కాంట్రాక్టర్, చీఫ్ ఇంజినీర్లను ప్రశ్నించిన న్యాయమూర్తి



చోడవరంలో విలేకరులతో మాట్లాడుతున్న పిటీషనర్ తరఫు న్యాయవాది కాంద్రేగుల దేవిడ్

చోడవరం: బీఎన్ రోడ్డు, అనకాపల్లి– మాడుగుల రోడ్లను ఎందుకు బాగుచేయలేదంటూ కాంట్రాక్టర్, చీఫ్ ఇంజినీర్‌ను ఏడీజే కోర్టు న్యాయమూర్తి ప్రశ్నించారు. బీన్‌రోడ్డు, అనకాపల్లి–మాడుగుల రోడ్లను బాగుచేయాలంటూ న్యాయవాదులు, ఆర్క్ స్వచ్ఛంద సంస్థ వేర్వేరుగా వేసిన పిటీషన్ వాయిదాకు రోడ్డు కాంట్రాక్టర్ ఎ.అశ్వంత్, రోడ్డు ప్రాజెక్టు చీఫ్ ఇంజినీర్ హాజరయ్యారు. సబ్బవరం నుంచి వయా చోడవరం, వడ్డాది, కొత్తకోట,రోలుగుంట మీదుగా మెయిన్(బీఎన్) రోడ్డు, అనకాపల్లి–మాడుగుల ఆర్ అండ్‌బీ రోడ్డు చాలా అధ్వానంగా ఉన్నాయని, వీటిని ఎందుకు బాగుచేయించలేదో తెలపాలంటూ జులై 7వతేదీన చోడవరం 9వ అదనపు జిల్లా కోర్టులో చోడవరానికి చెందిన న్యాయవాదులు అన్నాబత్తుల భరత్ భూషణ్, భూపతి రాజు, ఆర్క్ స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి ప్రసాద్ వేర్వేరుగా పిటీషన్లు దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై ఇప్పటికే రెండు వాయిదాల్లో నోటీసులు అందుకున్న అధికారులు కోర్టుకు హాజరుకాగా, అప్పట్లో రోడ్డు కాంట్రాక్టర్, ప్రాజెక్టు చీఫ్ఇంజినీర్ హాజరుకాలేదు. దీంతో ఈనెల 23వ తేదీన వాయిదాకు హాజరుకావాలని వారిని కోర్టు ఆదేశించింది. శనివారం వారిద్దరూ చోడవరం కోర్టుకు హాజరయ్యారు. ఈ రెండు రోడ్లను ఎందుకు బాగు చేయలేదని న్యాయమూర్తి ప్రశ్నించారు. వెంటనే మరమ్మతులు చేయాలని ఆదేశించారని పిటీషనర్ తరఫున న్యాయవాది, చోడవరం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు కాంద్రేగుల దేవిడ్ విలేకరులకు తెలిపారు. త్వరలో పనులు పూర్తి చేస్తామని కాంట్రాక్టర్, సీఈ చెప్పారన్నారు. సెప్టెంబరు 20వతేదీకి మరోసారి కేసును కోర్టు వాయిదా వేసిందని డేవిడ్ తెలిపారు. రోడ్డు పనులు పూర్తిస్థాయిలో చేపట్టకపోతే ప్రజలు పడుతున్న ఇబ్బందుల రీత్యా అవసరమైతే హైకోర్టుకు వెళతామని పిటీషనర్ తరఫు న్యాయవాది డేవిడ్ చెప్పారు.

ముగిసిన అమరావతి చాంపియన్‌షిప్ పోటీలు

మధురవాడ(విశాఖ): కొమ్మాది శాప్ స్టేడియంలో జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన 'అమరావతి చాంపియన్‌షిప్ పోటీలు' ముగిశాయి. రెండురోజుల పాటు జరిగిన ఈ జోన్–1 క్రీడల్లో ఉమ్మడి విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి సుమారు 1800 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఆర్చరీ, ఖోఖో, కబడ్డీ, వెయిట్‌లిఫ్టింగ్, అథ్లెటిక్స్, బాస్కెట్‌బాల్, వాలీబాల్ వంటి క్రీడాంశాల్లో పోటీలు జరిగాయి. విజేతలు తిరుపతిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. రాష్ట్ర స్థాయి విజేతలకు ఈ నెల 29న సీఎం చేతుల మీదుగా విశాఖలో బహుమతులు అందజేయనున్నారు. క్రీడాకారులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో నిర్వాహకులు విఫలమయ్యారని పలువురు వాపోయారు.

క్లుప్తంగా

చీపురు పట్టిన ఎస్పీ తుహిన్ సిన్హా

- కార్యాలయ ఆవరణలో చెత్తా చెదారాలు తొలగింపు



చీపురుతో చెత్త ఊడ్చుతున్న ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి: నిత్యం పోలీసు విధి నిర్వహణలో బిజీగా ఉండే ఎస్పీ తుహిన్ సిన్హా చీపురు పట్టి చెత్తా చెదారాలు ఊడ్చారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా శనివారం ఆయన పోలీసు సిబ్బందితో కలిసి తమ కార్యాలయ ఆవరణలో చెత్తా చెదారాలు ఊడ్చటంతోపాటు పిచ్చిమొక్కలు తొలగించి పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం వల్ల ఆరోగ్యంగా జీవించవచ్చన్నారు. వర్షాకాలంలో కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలన్నారు. జిల్లాలో అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఈ కార్యక్రమాన్ని తమ సిబ్బంది నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఏఎస్పీ ఎల్.మోహనరావు, డీఎస్పీ బి.మోహనరావు, సీఐలు టి.లక్ష్మి, లక్ష్మణమూర్తి, బెండి వెంకటరావు, బాల సూర్యారావు, సురేష్, రామకృష్ణ, ఎస్ఐలు ప్రసాద్, మల్లేశ్వరరావు, శిరీష తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాషన్ షోలో శిరీష ప్రతిభ



శిరీషకు మెడల్ అందిస్తున్న నిర్వాహకులు

నాతవరం: కాకినాడలో శనివారం ఎస్ఎస్ఆర్ మోడలింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫ్యాషన్ షోలో నాతవరం గ్రామానికి చెందిన ఎం.శిరీషకు అవార్డు లభించింది. ఈ ఏజెన్సీ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో ఫ్యాషన్ షోలు నిర్వహిస్తుంది. ఈ పోటీలకు అనేక మంది హాజరయ్యారు. వారిలో శిరీష ప్రతిభను గుర్తించి సౌత్ ఇండియా మోడల్‌కు ఎంపిక చేశారు. ఆమెను స్నేహితులు, బంధుమిత్రులు అభినందించారు.

కొలువు గురువు


రామకృష్ణ


సంతోష్


సురేష్


నాగేశ్వరరావు


లావణ్య


ఎడ్ల కుమారి


విరోతి ఆనంద్

డీఎస్సీ ఫలితాల్లో పేదింటి అభ్యర్థుల సత్తా


కురచా జోత్స్న


బంటు శివ

నక్కపల్లి: డీఎస్సీ ఫలితాల్లో పేదింటి అభ్యర్థులు ప్రతిభ కనబరిచారు. నక్కపల్లి మండలానికి చెందిన అభ్యర్థులు సత్తా చాటారు. దోసలపాడు గ్రామానికి చెందిన భవిరి శెట్టి రామకృష్ణ సోషల్ స్టడీస్‌లో జిల్లాలో 2వ ర్యాంకు సాధించాడు. రామకృష్ణ తల్లిదండ్రులు చిన్న తనంలోనే మరణించారు. అన్నయ్య, అమ్మమ్మ, నాన్నమ్మల వద్ద ఉంటూ ఉన్నత చదువులు చదివి డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యాడు. గొడిచర్ల గ్రామానికి చెందిన కర్రి నాగేశ్వరరావు స్కూల్ అసిస్టెంట్ విభాగంలో సోషల్ స్టడీస్‌లో 3వ ర్యాంకు సాధించాడు. ఈయన మోటారు సైకిళ్లకు సీట్లు కుట్టే షాపు నిర్వహిస్తూ బీఈడీ పూర్తి చేశాడు. కష్టపడి చదువుకుని స్కూల్ అసిస్టెంట్‌కు ఎంపికయ్యాడు. గొడిచర్ల గ్రామానికి చెందిన చెల్లపు లావణ్య 91 శాతం మార్కులతో జిల్లాలో ఎస్‌జీటీ విభాగంలో ఏడో ర్యాంకు సాధించింది. ఎస్‌జీటీలో డొంకాడ గ్రామానికి చెందిన ప్రగడ సురేష్ 133వ ర్యాంకు, చందిన సంతోష్ 178వ ర్యాంకు సాధించారు.

ఎస్జీటీలో మెరిసిన కుమారి

మాడుగుల: డీఎస్సీ ఎస్జీటీ విభాగంలో సత్యవరం గ్రామానికి చెందిన ఎడ్ల కుమారి 90.47079 మార్కులతో ఉమ్మడి విశాఖ జిల్లాలో 12వ ర్యాంకుతో మెరిసింది. తండ్రి మరిడినాయుడు వ్యవసాయ కూలి. పట్టుదలతో చదివి డీఎస్సీలో కొలువు సాధించిన కుమారిని కుటుంబ సభ్యులతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు. భవిష్యత్తులో సివిల్స్ సాధనే తన లక్ష్యమని కుమారి చెప్పారు.

రావికమతం: మండలంలో సుమారు 25 మంది డీఎస్సీలో సత్తా చాటారు. కొత్తకోటకు చెందిన విరోతి ఆనంద్ ఫిజికల్ డైరెక్టర్(పీడీ) 90.5 స్కోర్ సాధించి జిల్లాలో మొదటి స్థానంలో నిలిచాడు. టి.అర్జాపురంలో సీతిని జోగినాయుడు,(ఎస్ఏ), ఎస్‌జీటీలుగా కోల సత్తిబాబు, మడగల సత్యవేణి, మలిచెట్ల కుసుమ, గంధం మహేష్, పిల్ల ధనలక్ష్మి, దొండపూడి నుంచి తోట స్వాతి ఎంపికయ్యారు.

హిందీలో జిల్లా ఫస్ట్ జోత్స్న

చోడవరం: డీఎస్సీ ఫలితాల్లో పలు విభాగాల్లో చోడవరానికి చెందిన ఇద్దరు మహిళా అభ్యర్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారు. హిందీ విభాగంలో కురచా జోత్స్న జిల్లా మొదటి స్థానం సాధించగా.. సోషల్‌లో మహిళా విభాగంలో పందిరి పరమేశ్వరి జిల్లాలో 7వ ర్యాంక్ సాధించారు. వీరిద్దరూ వ్యవసాయ కుటుంబానికి చెందిన వారు కావడం విశేషం. ఉత్తమ ర్యాంక్‌లు సాధించిన వారిని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అభినందించారు.

రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి శివకు 26వ ర్యాంక్

కె.కోటపాడు : మండలంలో చౌడువాడ గ్రామానికి చెందిన రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి బంటు శివ డీఎస్సీలో ఓపెన్ కేటగిరిలో సోషల్‌లో 78.31 మార్కులతో ఉమ్మడి విశాఖ జిల్లాలో 26వ ర్యాంక్ సాధించాడు. 2005లో డిగ్రీ పూర్తి చేసిన శివ భారత సైన్యంలో చేరాడు. 17 ఏళ్ల పాటు ఆర్మీలో విధులు నిర్వహించి, 2021లో రిటైర్ అయ్యాడు. అనంతరం ఏయూలో 2021 నుంచి 2023 వరకూ బీఈడీ పూర్తి చేశాడు. డీఎస్సీకి ప్రిపేర్ కావడంతో పాటు కానిస్టేబుల్ పోస్టుకు కూడా ఇంటి వద్ద నుంచే శివ శిక్షణ పొందాడు.ఇటీవల సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. శుక్రవారం రాత్రి విడుదలైన డీఎస్సీ మెరిట్ లిస్టులో ఓపెన్ కేటగిరిలో జిల్లాలో 26వ ర్యాంక్‌ను సాధించాడు. ఆర్మీలో దేశానికి సేవ చేయడంతో పాటు రిటైర్ అయిన తరువాత కూడా రెండు ఉద్యోగాలకు ఎంపిక అయిన శివను పలువురు అభినందించారు. శివ ర్యాంక్ సాధించడం పట్ల తల్లి అప్పలనర్సమ్మ, భార్య వరలక్ష్మి ఆనందం వ్యక్తం చేశారు. శివకు కుమారుడు, కుమార్తె ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

అనకాపల్లి:

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతని కలెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం జేసీ ఎం.జాహ్నవి ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రతినెలా 3వ శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించి, ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. ప్రతి నెలా ఒక్కో అంశాన్ని తీసుకోవడం ద్వారా స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర పై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఆగస్టు నెలలో 'వర్షా కాలం పరిశుభ్రత' అనే నినాదంతో కార్యక్రమం నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీచేసినట్టు తెలిపారు. గ్రామాల పరిశుభ్రత, స్వచ్ఛతే స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం లక్ష్యమన్నారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధులు, తీసుకోవాల్సిన నివారణా చర్యలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత చాలా అవసరమన్నారు. ప్రతిఒక్కరూ చిత్తశుద్ధితో కృషి చేసి స్వచ్ఛగ్రామాలను రూపొందించాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో వై. సత్యనారాయణ రావు, జిల్లా పంచాయతీ అధికారి సందీప్, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి జి.రామారావు, కలెక్టర్ కార్యాలయ పరిపాలన, భూ పరిపాలన విభాగాల పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.



కలెక్టర్ కార్యాలయంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

ఆదర్శనీయులు ప్రకాశం పంతులు



టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి: ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు ఆదర్శనీయులని ఎస్పీ తుహిన్ సిన్హా అన్నారు. 154వ జయంతి సందర్భంగా టంగుటూరి చిత్రపటానికి శనివారం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టంగుటూరి ప్రకాశం పంతులు నీతి నిజాయితీ, నైతిక విలువలు,త్యాగనిరతి, ధైర్యసాహసాలు స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎల్.మోహనరావు, సీఐలు టి.లక్ష్మి, లక్ష్మణమూర్తి, బెండి వెంకటరావు, బాల సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో టీడీపీ ఫ్లెక్సీల తొలగింపు



శుక్రవారం రాత్రి 8 గంటల సమయంలో గొలుగొండ ఎంపీపీ పాఠశాల వద్ద ఉన్న ఫ్లెక్సీలు



శనివారం ఉదయానికి ఫ్లెక్సీలు లేని ఎంపీపీ పాఠశాల గొలుగొండ

సాక్షి ఎఫెక్ట్..

గొలుగొండ: చోద్యం సహకార బ్యాంక్ చైర్మన్‌గా ఎన్నికైన చిటికెల సాంబమూర్తికి స్వాగతం పలుకుతూ ఇటీవల స్థానిక పాఠశాల ప్రధాన గేటు వద్ద ఏర్పాటు చేసిన టీడీపీ ఫ్లెక్సీలను విద్యాశాఖ అధికారులు ఎట్టకేలకు తొలగించారు. స్కూలా- టీడీపీ కార్యాలయమా? శీర్షికతో శనివారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. శనివారం ఉదయం 7 గంటలకే పాఠశాల ప్రధాన ద్వారం వద్ద టీడీపీ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించినట్లు ఎంఈవో సత్యనారాయణ తెలిపారు. విద్యా సంస్థల వద్ద ఎటువంటి ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బడిఈడు పిల్లలు బయట ఉండకూడదు

- విద్యతో పాటు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి
- జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి మంగవేణి

నాతవరం: జిల్లాలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో 3200 మంది విద్యార్థులు చదువుతున్నారని జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారి జి.మంగవేణి తెలిపారు. శనివారం ఆమె నాతవరం మండలంలో పర్యటించిన అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో గిరిజన సంక్షేమ ఆశ్రమ పోస్టుమెట్రిక్ స్కూల్స్ జీపీఎస్ పాఠశాలలు మొత్తం 22 ఉన్నాయన్నారు. బడి ఈడు పిల్లలు బడి బయట లేకుండా చేయడమే ధ్యేయంగా పని చేస్తున్నామన్నారు. ఏజెన్సీ గిరిజన మారుమూల ప్రాంతాల్లో సరైన సదుపాయాలు లేక మధ్యలోనే బడి మానేస్తున్నారన్నారు. అలాంటి వారి కోసం క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న గిరిజన సంక్షేమ ఆశ్రమ హాస్టళ్లలో మెరుగైన విద్య అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. విద్యార్థులకు విద్యతో పాటు ఆరోగ్యం విషయంలో తగు జాగ్రత్తలు పాటించాలని సిబ్బందికి సూచనలు చేశామన్నారు. తాండవ గిరిజన ఆశ్రమ బాలికల వసతి గృహానికి సుమారుగా రూ.3 కోట్లు కేటాయించామని, అదనపు భవన నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయన్నారు.

వ్యర్థ జలాలు తాగి పాడి ఆవుల మృతి



పాడి ఆవుల కళేబరాలు

నక్కపల్లి: మండలంలో రాజయ్యపేట సమీపంలో ఉప్పుటేరులో వ్యర్థ రసాయనాలు కలిసిన నీటిని తాగడం వల్ల శనివారం రెండు పాడి ఆవులు మరణించాయి. బాధిత రైతు బొందలపు విజయ్ కథనం మేరకు.. సమీపంలో రసాయన కంపెనీ నుంచి విడుదలవుతున్న వ్యర్థ రసాయనాలు ఉప్పుటేరులో కలుస్తున్నాయి. ఈ నీటిని తాగి రెండు పాడి ఆవులు మృత్యువాత పడ్డాయని ఆరోపిస్తున్నాడు. ఆవులు మరణించిన విషయం కలెక్టర్‌కు, పొల్యూషన్ కంట్రోలు బోర్డుకు ఫిర్యాదు చేస్తానన్నాడు. తమను ఆదుకోవాలని కంపెనీపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నాడు.

స్త్రీ శక్తి పథకంతో పెరిగిన ఓఆర్



గ్యారేజ్‌లో మరమ్మతులను పరిశీలిస్తున్న డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ ఇంజనీర్ గంగాధర్

నర్సీపట్నం: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా బస్సుల కండిషన్ మెరుగుపరిచామని ఉమ్మడి జిల్లా డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ ఇంజనీర్ గంగాధర్ అన్నారు. శనివారం ఆయన నర్సీపట్నం ఆర్టీసీ డిపోను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్త్రీ శక్తి పథకంతో 65 శాతం నుంచి 95 శాతానికి ఓఆర్ పెరిగిందన్నారు. జిల్లాలోని 10 డిపోలు ఉన్నాయన్నారు. ఈ డిపోల్లో 686 ఆర్టీసీ బస్సులు, 122 అద్దె బస్సులను తిప్పుతున్నామన్నారు. బస్సుల నిర్వహణ షెడ్యూల్ ప్రకారం చేపడుతున్నామన్నారు. త్వరలోనే ఎలక్ట్రికల్ బస్సులు వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు బస్సుల కండిషన్‌పై ప్రత్యేక దృష్టిసారించామన్నారు. పలు విషయాలను ఆయన డిపో మేనేజర్ ధీరజ్‌ను అడిగి తెలుసుకున్నారు.

ఆరుగురు గంజాయి నిందితుల అరెస్టు

- 240 కేజీల గంజాయి స్వాధీనం
- ఒకరు పరారీ



నిందితులతో సీఐ విజయ్ కుమార్

అనకాపల్లి టౌన్: గంజాయిని అక్రమంగా తరలిస్తున్న ఆరుగురు నిందితులని అరెస్ట్ చేశామని పట్టణ సీఐ టి.వి. విజయ్ కుమార్ తెలిపారు. వారి నుంచి 240 కేజీలు గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. అల్లూరి జిల్లా జి. మాడుగుల మండలానికి చెందిన సోమెలి బాలకృష్ణ(33), సోమెలి ప్రవీణ్ కుమార్(25), విస్సారపు లింగేశ్వరావు(25), చీడికాడ మండలం బయలపూడి గ్రామానికి చెందిన షేక్ హుస్సేన్(24), షేక్ హుస్సేన్(24), చేబోలు సంతోష్(28) తమిళనాడు వ్యాపారులకు గంజాయి అమ్మడానికి ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ మేరకు జి. మాడుగులలో గంజాయిని కొనుగోలు చేసి కారులో అనకాపల్లి రైల్వే స్టేషన్‌కు తీసుకువస్తుండగా గూడ్స్‌రోడ్ జంక్షన్ వద్ద శనివారం మధ్యాహ్నం ఎస్ఐ సంతోష్‌కుమార్ తన సిబ్బందితో దాడి చేసి పట్టుకున్నారు. వీరి కారుకు పైలట్‌గా మోటార్ బైక్‌పై వచ్చిన మరొక వ్యక్తి పోలీసులను చూసి పరారయ్యాడు. పట్టుబడిన ఆరుగురు నిందితుల నుంచి ఐదు సెల్‌ఫోన్లు, రూ.4 వేలు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. పరారైన నిందితుడు కోసం గాలిస్తున్నామన్నారు. సమావేశంలో ఎస్ అల్లు వెంకటేశ్వరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

డి.గొట్టివాడలో పూరిల్లు దగ్ధం

- రూ.3 లక్షల ఆస్తి నష్టం



మంటల్లో కాలి బూడిదయిన పూరిల్లు



కాలిపోయిన నగదు, ఫర్నిచర్

మాడుగుల రూరల్: మండలంలో డి.గొట్టివాడ గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి పూరిల్లు దగ్ధమైంది. ఈ ప్రమాదంలో రూ.3 లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. రెండు కుటుంబాల వారు నిరాశ్రులయ్యారు. గ్రామానికి చెంది నంబారు గోసం నాయుడు, నంబారు చినతల్లి పూరింటిలోని రెండు గదుల్లో నివాసముంటున్నారు. అర్ధరాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో 15 బస్తాల ధాన్యం, లక్ష రూపాయల నగదు, భూమిపత్రాలు, దుస్తులు, ఫర్నిచర్ కాలి బూడిదయ్యాయి. స్థానికుల సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది వచ్చేసరికే అన్ని కాలిపోయాయి. బాధితులు తీవ్రంగా రోదిస్తున్నారు. వీఆర్వో సంఘటనా స్థలాన్ని పరిశీలించి నష్ట నివేదిక తహసీల్దార్ అందజేసి ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందేలా కృషి చేస్తామన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం



ప్రమాదానికి కారణమైన వ్యాన్

చోడవరం: మండలంలోని వెంకన్నపాలెం వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే దుర్మరణం చెందగా, మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఎస్ఐ జోగారావు అందించిన వివరాల ప్రకారం..వెంకన్నపాలెం నుంచి అనకాపల్లి వైపు వెళుతున్న వ్యాన్ ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొంది. దీంతో బైక్‌పై వస్తున్న మండలంలోని ఎం. కొత్తపల్లికి చెందిన వెదిరి రామునాయుడు (42) అక్కడే మృతి చెందాడు. నంబారు సోమినాయుడు రెండు కాళ్లు విరిగిపోయి తీవ్రంగా గాయపడ్డాడు. రామునాయుడు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, గాయపడిన సోమినాయుడును ప్రైవేటు ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. ప్రమాదంలో బైక్ దెబ్బతింది. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



ప్రతిజ్ఞ చేస్తున్న డీఎం అండ్ హెచ్‌వో ఎం.హైమావతి

అనకాపల్లి: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం సాధ్యమని డీఎం అండ్ హెచ్‌వో ఎం.హైమావతి అన్నారు. స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రి ఆవరణలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా వర్షా కాలంలో వరదలు, అంటువ్యాధుల నివారణ అనే అంశంపై శనివారం పోస్టర్ ఆవిష్కరించి, ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలంలో అంటువ్యాధులు బారినపడకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో ఎస్.రమణ, డీఎస్‌వో షరీఫ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ముగ్గురు పేకాటరాయుళ్ల అరెస్ట్

మునగపాక: మండలంలోని నాగవరం సమీపంలో పేకాడుతున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ పి.ప్రసాదరావు తెలిపారు. నాగవరంలో పేకాడుతున్నట్లు అందిన ఫిర్యాదు మేరకు శనివారం మునగపాక పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో పేకాడుతున్న ముగ్గుర్ని అదుపులోకి తీసుకొని, వారి నుంచి రూ.1000 నగదును స్వాధీనం చేసుకున్నారు.

క్లుప్తంగా

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు


ఎరువుల షాపులో రికార్డులను పరిశీలిస్తున్న మండల ప్రత్యేక అధికారి సుబ్బలక్ష్మి

అనకాపల్లి టౌన్: మండలంలోని పలు ఎరువుల దుకాణాల్లో మండల ప్రత్యేక అధికారి సుబ్బలక్ష్మి ఆధ్వర్యంలో శనివారం తనిఖీలు నిర్వహించారు. షాపుల్లో స్టాక్ వివరాలు, రిజిస్టర్ బిల్లులు క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎటువంటి అవకతవకలు లేకుండా రైతులకు సకాలంలో ఎరువులను సరఫరా చేయాలని సూచించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకు మాత్రమే అమ్మాలన్నారు. మండలంలో 526 మెట్రిక్ టన్నుల యూరియాను ప్రైవేట్ డీలర్లు, సొసైటీలు, రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకుడు సిహెచ్ సుబ్రహ్మణ్యం, విజిలెన్స్ ఇన్‌స్పెక్టరు రామయ్య, మండల వ్యవసాయాధికారి పి. రంగాచారి పాల్గొన్నారు.

విద్యార్థినులకు ఉపకార వేతనాలు అందజేత


వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో బాలికలకు ఉపకార వేతనాలు అందజేత

కశింకోట: వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో విరివిగా సేవా కార్యక్రమాలు నిర్వహించి పేదలకు ఆసరాగా నిలుస్తున్నట్టు క్లబ్ జిల్లా ఐఈసీ ఆఫీసర్, విద్యా సంకల్ప శ్రేయోభిలాషి, వాసవీ దాత పులవర్తి సత్య వరహాలరావు తెలిపారు. క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక బాలికల హైస్కూలులో ఐదుగురు బాలికలకు రూ.వెయ్యి వంతున ఉపకార వేతనాలు శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో క్లబ్ ఆధ్వర్యంలో పాఠశాలల ప్రగతికి అనేక రూపాల్లో వితరణ చేశామన్నారు. టెన్త్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు, విగ్రహాల ప్రతిష్ట, వంట సామగ్రి, పుస్తకాలు, సీలింగ్ ఫ్యాన్లు అందజేయడం, మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలు నిర్వహించామని గుర్తు చేశారు. విద్యార్థులు బాగా చదువుకొని ఉత్తమ ఫలితాలు సాధించడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కశింకోట క్లబ్ అధ్యక్షుడు జె.సూకరాజు, ప్రధాన కార్యదర్శి డివికె గుప్తా, జిల్లా ఆఫీసర్ కె. వేంకటేశ్వరరావు, ప్రతినిధులు డి. సందీప్, డి. ప్రసాద్, విద్యార్థినుల తల్లిదండ్రులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలు పంపిణీ

అనకాపల్లి టౌన్: పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలను పూజించాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ కోరారు. మండలంలోని తుమ్మపాలలో ఆయన మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బొడ్డపాటి చిన్న రాజారావు, కర్రి బాబి తదితరులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు

అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శనివారం 59 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	----	----
రెండో రకం	----	----
మూడోరకం	3,250	3,420

అనకాపల్లి సినిమాలు

రాజా	:సార్ మేడమ్
సత్యనారాయణ స్క్రీన్-1	: పరద
సత్యనారాయణ స్క్రీన్-2	: మేఘాలు చెప్పిన ప్రేమకథ
పర్తిసాయి	: మహావతార్ నరసింహం
షిర్డీసాయి	: కూలీ
వెంకటేశ్వర	: బన్ బట్టర్ జామ్
శ్రీ సత్య	: సోమేశ్వర సులోచన
రామచంద్ర	: వార్ 2

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 34 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్-5, బీ పాజిటివ్-10, ఓ పాజిటివ్-16, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు శుద్ధి చేసిన రక్త నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంక్ టెక్నీషియన్ యాలోకేష్(9703613706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 341 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 286 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

మొదలైన చవితి సందడి

- వీధి వీధినా మండపాలు ఏర్పాట్లు
- ముస్తాబవుతున్న వినాయక విగ్రహాలు
- మట్టి ప్రతిమలు ఉచితంగా పంపిణీకి సిద్ధం


విక్రయానికి సిద్ధంగా గణనాథుని విగ్రహాలు


ఉచిత పంపిణీకి సిద్ధంగా మట్టి వినాయక విగ్రహాలు

తుమ్మపాల: హిందువుల మొదటి పూజ వినాయకుడికే.. విఘ్నాలు తొలగించాలని వేడుకుంటారు. ఈ నెల 27న వినాయక చవితి వేడుకలకు ఊరూ వాడా సిద్ధమవుతోంది. ఉత్సవ కమిటీలతోపాటు యువకులు పందిర్లు ఏర్పాటు చేసి గణనాథుని విగ్రహాలు నెలకొల్పేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

- **చురుగ్గా భారీ విగ్రహాల తయారీ**

జిల్లా కేంద్రమైన పట్టణంలో పూడిమడక రహదారిలో వివిధ రాష్ట్రాల నుంచి కళాకారులు వలస వచ్చి వివిధ ఆకృతుల వినాయక విగ్రహాలను తయారు చేస్తున్నారు. వినాయక చవితికి మరో నాలుగు రోజులే గడువు ఉండటంతో రాత్రింబవళ్లు అలంకరణ పనులు చేస్తున్నారు. చిన్నపాటి విగ్రహాల నుంచి 5, 10, 20 అడుగుల ఎత్తున విగ్రహాల తయారీ అవుతున్నాయి. రంగురంగుల రూపాల్లో వినాయకులను తయారు చేస్తున్నారు. ఒక్కో విగ్రహాన్ని రూ.10 వేల వరకు అత్యధిక ధరకు అమ్మకాలు చేయవచ్చని తయారీదారులు చెబుతున్నారు. కరోనా తర్వాత పూర్తిగా తగ్గిపోయిన అమ్మకాలు ఇప్పుడిప్పుడే మళ్లీ పుంజుకుంటున్నాయని, ఏడాదికి ఒక సారి జరుపుకునే వినాయక చవితి వేడుకకు ముందుగానే విగ్రహాలను తయారుచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చే పనిలో కళాకారులు నిమగ్నమయ్యారు.

- **మట్టి విగ్రహాల పంపిణీకి ఏర్పాట్లు...**

పట్టణంతోపాటు పరిసర గ్రామాల ప్రజలు, పట్టణానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వారికి మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేసేందుకు పలు సంఘాల పోటీపడుతున్నాయి. పర్యావరణాన్ని రక్షించడం అందరి బాధ్యత అనే భావన కల్పించేలా మట్టి వినాయక విగ్రహాలను తయారు చేయించి ఉచితంగా పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. పది వేల వరకు మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేపట్టనున్నారు. ప్రతి ఇంటిలో మట్టి వినాయక విగ్రహాలను నెలకొల్పి వినాయక చవితి పూజలు చేయాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.

- **పట్టణంలో 120 అడుగుల గణనాథుడు....**

మునుపెన్నడు లేని విధంగా జిల్లా కేంద్రమైన అనకాపల్లి పట్టణంలో ఎన్టీఆర్ గ్రౌండ్‌లో 120 అడుగుల ఎత్తున గణనాథుని విగ్రహాన్ని నెలకొల్పేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు నెల రోజులుగా భారీ మండపాన్ని ఏర్పాటు చేస్తున్నారు. వినాయక ఉత్సవాల్లో అనకాపల్లికి పేరు వచ్చే విధంగా ఈ ఏర్పాట్లలో నిమగ్నమై పనిచేస్తున్నారు.


విక్రయానికి సిద్ధంగా విగ్రహాలు

వెండి హృదయ లక్ష్మీదేవీ ప్రతిమల అలంకరణ


వెండి హృదయ లక్ష్మీదేవీ ప్రతిమలు


వెండి హృదయ లక్ష్మీదేవీ ప్రతిమల అలంకరణతో ధ్యాన వేంకటేశ్వరస్వామి

కశింకోట: స్థానిక వేంకటేశ్వరస్వామి ధ్యాన మందిరంలో భాద్రపద మాసం మొదటి శనివారం పురస్కరించుకుని స్వామి వారికి హృదయ లక్ష్మీదేవీ వెండి ప్రతిమలను ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. వీటిని రాపేటి అప్పలనాయుడు, నాగలక్ష్మి దంపతులు రూ.35 వేలతో సమకూర్చారు. వజ్ర కవచాలంకృతులతోపాటు సాలగ్రామాలు, వివిధ రకాల పూలమాలలు, తులసీమాలలతో అందంగా అలంకరించారు. విష్ణు సహస్ర నామార్చన, ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. నక్షత్ర హారతి ఇచ్చారు. అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి. భక్తులు ఎక్కువ సంఖ్యలో దర్శించారు.

క్రీడలతో మానసిక ప్రశాంతత

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి మలసాల కుమార్‌రాజా


క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న మలసాల కుమార్‌రాజా

అనకాపల్లి: క్రీడలతో ఆరోగ్యంగా జీవించవచ్చని, మానసిక ఉల్లాసానికి ఎంతగానో దోహదపడతాయని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి మలసాల కుమార్‌రాజా తెలిపారు. ఈ నెల 27న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ జన్మదిన వేడుకలు పురస్కరించుకుని ఆ పార్టీ 84వ వార్డు ఇన్‌చార్జి కోరుకొండ రాఘవ ఆధ్వర్యంలో నిర్వహించే స్థానిక రింగ్‌రోడ్డు నెట్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలను శనివారం కుమార్‌రాజా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో 35 జట్లు పాల్గొంటున్న ఈ పోటీలు ఈ నెల 24, 25 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రథమ, ద్వితీయ బహుమతులుగా రూ.20 వేలు, రూ.10 వేలతోపాటు షీల్డ్‌లు ఈ నెల 27న స్థానిక రింగ్‌రోడ్డు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ప్రదానం చేస్తామన్నారు. ఈ టోర్నమెంట్‌ను పార్టీ పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు వేగి త్రినాథ్, ఎలుగుల కృష్ణచైతన్య సహకారంతో నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, కసింకోట జెడ్పీటీసీ దంతులూరి శ్రీధర్ రాజు, కసింకోట ఎంపీపీ కలగా లక్ష్మీగున్నయ్య నాయుడు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, నిర్వాహకులు కేతిరెడ్డి ప్రసాద్, నగిరెడ్డి వరుణ్, నలిని సందీప్, రాకేష్, రవితేజ, శానాపతి సాయి, రాజేష్, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కోతలతో ఇబ్బందులు

కశింకోట: మండలంలోని నరసింగబిల్లి పంచాయతీ పరిధిలో ఇష్టానుసారంగా విద్యుత్ కోతలు విధిస్తున్నారని, దీనివల్ల ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని సర్పంచ్ కోన అరుణ ఆవేదన వ్యక్తం చేశారు. ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా విద్యుత్ సరఫరా నిలిపి వేస్తుండటం వల్ల ప్రజలు, విద్యార్థులు, వ్యాపారులు, రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని వాపోయారు. దీనిదృష్ట్యా విద్యుత్ సరఫరా నిలిపి వేసేటప్పుడు ముందస్తుగా సమాచారం తెలియజేయాలని, ప్రజలకు ఇబ్బంది లేకుండా ఉన్నత అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని కోరారు.

దివ్యాంగుల పింఛన్లు రద్దు చేస్తే ఆందోళన


వినాయక పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్

అనకాపల్లి: నియోజకవర్గంలో 180 మంది దివ్యాంగులు పింఛన్లు తొలగించేందుకు నోటీసులు జారీ చేశారని, తక్షణమే వాటిని వెనక్కి తీసుకుని యథావిధిగా పింఛన్లు పంపిణీ చేయకపోతే ఆందోళన చేస్తామని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ హెచ్చరించారు. శనివారం స్థానిక రింగ్‌రోడ్డు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ప్రజల పక్షాన పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. ఏడాదిన్నరకే కూటమి ప్రభుత్వంపై ప్రజలు నిప్పులు చెరుగుతున్నట్లు పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్తగా ఒక్క పింఛన్ మంజూరు చేసిన పాపాన పోలేదన్నారు. పైగా దివ్యాంగుల పింఛన్లు తొలగించడం దుర్మార్గమన్నారు. 50 ఏళ్లు నిండిన బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు పింఛన్ల మంజూరు చేసి ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలన్నారు. రాష్ట్రంలో సంపదను సృష్టిస్తామని గద్దెనెక్కిన తర్వాత దశలు వారీగా పింఛన్లు, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను తొలగించడం అన్యాయమన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలే ఓటుతో బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

ప్రశాంతమైన వాతావరణంలో గణపతి నవరాత్రులు ప్రశాంతమైన వాతావరణంలో ఉత్సవ కమిటీలు గణపతి నవరాత్రి ఉత్సవాలను నిర్వహించాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ కోరారు. వేల్పులవీధిలో ఏర్పాటు చేస్తున్న 30 అడుగుల వరసిద్ధి వినాయక ఉత్సవ పోస్టర్‌ను విస్టార్ గైస్ ఆధ్వర్యంలో స్థానిక రింగ్‌రోడ్డులోని పార్టీ కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కమిటీ సభ్యులు రహదారులపై పందిళ్లు ఏర్పాటు చేసే సమయంలో ప్రజలకు, వాహనదారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. పర్యావరణ పరిరక్షణను దృష్టిలో పెట్టుకుని మట్టి విగ్రహాలను పూజించాలని కోరారు. వేల్పులవీధి వీస్టార్ గైస్ కమిటీ సభ్యులు, పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, 80వ వార్డు ఇన్‌చార్జి కె.ఎం.నాయుడు, పార్టీ సీనియర్ నాయకులు బొడ్డేడ శివ, కొణతాల మురళీకృష్ణ, దాడి నారాయణరావు, ఉగ్గిన అప్పారావు, ప్రభాకర్, కొంకి శ్రీరామూర్తి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన


మాట్లాడుతున్న హెచ్ఎం రవికుమార్

కశింకోట: వర్షా కాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని హెచ్ఎం కె.రవికుమార్ సూచించారు. మండలంలోని నరసింగబిల్లి జెడ్పీ హైస్కూలులో విద్యార్థులకు సీజనల్ వ్యాధుల పట్ల శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జలుబు, తలనొప్పి, జ్వరం, విరోచనాలు తదితర సీజనల్ వ్యాధులు వచ్చినప్పుడు వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలన్నారు. దోమల ద్వారా వచ్చే డెంగ్యూ, మలేరియా, ఇతర అంటు వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యాధులు సోకకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమల వృద్ధికి కారణమయ్యే తాగి పారేసిన కొబ్బరి బొండాలు, వాహనాల నుంచి తొలగించిన టైర్లలో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. కాచి చల్లార్చిన మంచినీరు తాగాలన్నారు. జంక్ ఫుడ్‌లకు దూరంగా ఉండాలన్నారు. సైన్స్ ఉపాధ్యాయిని బి.వి. లక్ష్మి, యర్రా శ్రీనివాసరావు, పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ ఎస్. మణిరావు, ఉపాధ్యాయ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

215 మందికి వైద్య పరీక్షలు

కశింకోట: స్థానిక గవరపేట అంగన్‌వాడీ కేంద్రంలో ఉచిత వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. ఇక్కడి పీహెచ్‌సీ వైద్యాధికారి యశోద 215 మందికి సేవలందించారు. మందులు పంపిణీ చేశారు. అవసరమైన వారికి బీపీ, సుగర్ పరీక్షలు నిర్వహించారు. బీపీ, సుగర్ వ్యాధిగ్రస్తులకు నెలవారీ మందులు అందజేశారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, జ్వరం, తలనొప్పి, విరోచనాలు, జలుబు, దగ్గు ఉంటే పీహెచ్‌సీని సంప్రదించి వైద్య సేవలు పొందాలని సూచించారు. దోమల వల్ల డెంగ్యూ, మలేరియా వంటి జ్వరాలు వచ్చే అవకాశం ఉందన్నారు. దీనిదృష్ట్యా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు. ఎంఎల్‌హెచ్‌పి దుర్గ, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొన్నారు..

మండపాలకు ఉచిత విద్యుత్ ఇవ్వాలి


మాట్లాడుతున్న విల్లూరి శ్రీనివాసరావు

అనకాపల్లి: గణపతి మండపాలకు ఉచితంగా విద్యుత్‌ను సరఫరా చేయాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని జిల్లా గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధి విల్లూరి శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక మెయిన్ రోడ్డులోని ఓ ప్రైవేటు హాల్లో శనివారం ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఈ ఏడాది నుంచి గణపతి నవరాత్రులు తర్వాత సామూహికంగా వినాయక నిమజ్జనోత్సవం నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. హిందువులు ఐక్యంగా ఉండి చవితి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సమితి జిల్లా అధ్యక్షుడు బంకుపల్లి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు కొణతాల అప్పలరాజు, జిల్లా కమిటీ సభ్యుడు బొడ్డేడ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

దంత సంరక్షణతో ఆరోగ్యం


విద్యార్థులకు దంత పరీక్షలు వైద్యులు

కశింకోట: దంతాలను సంరక్షించుకుంటే శరీరం ఆరోగ్యంగా ఉంటుందని విశాఖ అనిల్ నీరుకొండ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్స్ సంస్థ ప్రొఫెసర్, ఆర్థోడెంటిక్ విభాగాధిపతి డాక్టర్ భరతం శ్రీనివాస్ తెలిపారు. శనివారం స్థానిక సెయింట్ జాన్స్ స్కూలులో నీరుకొండ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. విద్యార్థులకు పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యం దృష్ట్యా దంతాల సంరక్షణ పట్ల విద్యార్థులు నిర్లక్ష్యం చూపకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. దంతాల సంరక్షణకు తీసుకోవలసిన జాగ్రత్త గురించి వివరించారు. దంత సంరక్షణపై లఘు చిత్రాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో వైద్యులు అనుపమ, నీరజ, స్కూలు కరస్పాండెంట్ బత్తుల అనూరాధ, అధ్యాపకులు పాల్గొన్నారు.

స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ విధానాలను ఆపాలి

ఏపీ రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి కోన మోహన్‌రావు డిమాండ్


మాట్లాడుతున్న ఏపీ రైతు కూలి సంఘం జిల్లా కార్యదర్శి కోన మోహన్‌రావు

అనకాపల్లి టౌన్: విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ విధానాలను ఆపాలని ఏపీ రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి కోన మోహన్‌రావు డిమాండ్ చేశారు. స్థానిక ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనే నినాదంతో 32 మంది ప్రాణ త్యాగాలతో వందలాది గ్రామాల ప్రజలు నిర్వాసితులై 26 వేల ఎకరాల భూములను త్యాగం చేసి పోరాడి సాధించుకున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వాలు ప్రైవేట్ పరం చేయాలని చూడడం దారుణమన్నారు. ఇప్పటికే వీఆర్ఎస్ పేరుతో 1,150 మంది ఉద్యోగులను, నాలుగు వేల మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను తొలగించిందన్నారు. కొత్తగా 32 విభాగాలను అమ్మేయడానికి కుట్రలు పన్నుతుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్లాంట్‌ను ప్రైవేటీకరణను అడ్డుకుంటామని చెప్పి ఇప్పుడు నిమ్మకు నీరెత్తనట్లు వ్యవహరిస్తుందన్నారు. కేంద్రం ఇచ్చిన 11,400 కోట్లను ప్లాంట్ అప్పులు తీర్చడానికి, ఇతర అవసరాల నిమిత్తం వినియోగిస్తున్నారే తప్పా దాని అభివృద్ధికి కేటాయించలేదన్నారు. తక్షణమే ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపివేసి దాని అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలన్నారు. సమావేశంలో నవయువ సమాఖ్య రాష్ట్ర నాయకులు నందారపు భాస్కరరావు, సభ్యులు సేనాపతి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో దివ్యాంగుడి మృతి


బాలాజీరావు(ఫైల్)

పరవాడ: పరవాడ-లంకెలపాలెం రహదారిలో శుక్రవారం రాత్రి అగ్నిమాపక కేంద్రం సమీపంలోని డివైడర్ ఢీకొట్టిన ప్రమాదంలో చింతల బాలాజీరావు(38) అనే దివ్యాంగ వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు తెలిపిన వివరాలిలా.. నాతవరం గ్రామానికి చెందిన దివ్యాంగుడు బాలాజీరావు కొంత కాలం కిందట తానాం వచ్చి పాన్‌షాపు నడుపుకుంటూ జీవిస్తున్నాడు. శుక్రవారం రాత్రి తానాం గ్రామానికి చెందిన సూరి అప్పారావును తీసుకొని బాలాజీరావు తన మూడు చక్రాల వాహనంపై పరవాడ నుంచి లంకెలపాలెం వెళ్తున్న క్రమంలో అగ్నిమాపక కేంద్రం వద్దకు రాగానే వాహనం అదుపుతప్పి డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన బాలాజీరావు అక్కడికక్కడే మృతిచెందాడు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వాహనం వెనుక కూర్చున్న అప్పారావుకు స్వల్ప గాయాలయ్యాయి. అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో శనివారం పోస్టుమార్టం నిర్వహించి బాలాజీరావు మృతదేహాన్ని బంధువులకు అప్పగించామని సీఐ మల్లికార్జునరావు చెప్పారు.

సింహగిరిపై స్వచ్ఛ ఆంధ్ర


సింహగిరిపై ఆలయ రాజగోపురం ఎదురుగా శుభ్రం చేస్తున్న అధికారులు, సిబ్బంది

సింహాచలం : సింహగిరిపై శనివారం స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించా రు. రాజగోపురం ఎదురుగా ఉన్న ప్రాంగణం, నక్షత్రవనం , ఆలయ పరిసరాలను దేవస్థానం సిబ్బంది శుభ్రం చేశారు. ఈ సందర్భంగా దేవస్థానం ఉద్యోగులంతా ప్రతిజ్ఞ చేశారు. రోజూ పరిశుభ్రతకు కొంత సమయం కేటాయిస్తామని, స్వచ్ఛత కోసం శ్రమదానం చేస్తామని, తడి - పొడి చెత్త వేరు చేయడంపై అవగాహన కల్పిస్తామని, పరిశుభ్ర ఆంధ్రప్రదేశ్ సాధనలో భాగస్వాములవుతామని ప్రతిజ్ఞ చేశారు. దేవస్థానం డిప్యూటీ ఈవో రాధ, ఏఈవోలు కె.తిరుమలేశ్వరరావు, పంతం శ్రీనివాస్, సూపరింటెండెంట్ త్రిమూర్తులు, సత్యవాణి, కంచి మూర్తి, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల సందర్శన


అంగన్‌వాడీ కేంద్రంలో పాప ఎత్తును పరిశీలిస్తున్న సంక్షేమ అధికారి సూర్యలక్ష్మి

సబ్బవరం: మండలంలోని ఇరువాడ, బాటజంగాలపాలెంలోని అంగన్‌వాడీ కేంద్రాలను శనివారం జిల్లా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ అధికారి ఎస్.సూర్యలక్ష్మి సందర్శించారు. గర్భిణులు, బాలింతలతోపాటు 3-6 ఏళ్ల పిల్లల తల్లులతో సమావేశమై వారికి అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. పోషకాహార ప్రాముఖ్యత, పరిశుభ్రత గురించి వివరించారు. పిల్లల బరువు, ఎత్తులను పరిశీలించి, అంగన్‌వాడీ కార్యకర్తలకు చిన్నారుల ఎత్తు కొలిచే విధానాలను వివరించారు. స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా తల్లులకు పరిశుభ్రత గురించి వివరిస్తూ వారి చేత ప్రతిజ్ఞ చేయించారు. బాటజంగాలపాలెం కేంద్రంలో స్వచ్ఛాంధ్ర స్వచ్ఛత గురించి వివరించి వారిచే ప్రతిజ్ఞ చేయించారు. సబ్బవరం ఐసీడీఎస్ సీడీపీవో లలితకుమారి, సూపర్‌వైజర్ డి.అప్పలనర్సమ్మ, మహిళా సంరక్షణ కార్యదర్శులు, కార్యకర్తలు పాల్గొన్నారు.